సాక్షి కుమురంభీం

శుక్రవారం । 6 ‌డిసెంబర్ । 2024



గొర్రెల మందపై దాడి

చింతలమానెపల్లి మండలం రణవెల్లి సమీపంలో మేకలు, గొర్రెల మందపై అటవీ జంతువులు దాడి చేశాయి. 20కి పైగా మూగజీవాలు మృతి చెందాయి. 8లో▸

9 నుంచి సదరం శిబిరాలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 9 నుంచి సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో దత్తారావు అన్నారు. వికలత్వ పరీక్ష చేయించుకొని స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత శిబిరానికి హాజరు కావాలని సూచించారు. ఈ నెల 9న మూగ, చెవిటి, 10న కంటి చూపు, 23న మానసిక వైకల్యం, 24న ఎముకల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.3 /22.4

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలి ప్రభావం చాలా వరకు తగ్గుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిధులు విడుదల చేయాలని వినతి



పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయవాదులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో కోర్టు భవన సముదాయ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు మెంబర్ భార్గవ్ నేతృత్వంలో గురువారం హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్, పోర్టు ఫోలియో జస్టిస్ రాజేశ్వర్‌ను కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాలకు రూ.10 కోట్ల చొప్పున నిధులు మంజూరు కాగా, జిల్లాకు మంజూరు కాలేదని తెలిపారు. జిల్లా కేంద్రంలో న్యాయస్థానాల నిర్మాణానికి ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, వెనుకబడిన కుమురంభీం జిల్లాకు రూ.90 కోట్లు మంజూరు చేయాలని కోరారు. న్యాయవాదులు టి.సురేశ్, ఎం.సురేశ్, హరీశ్, బోనగిరి సతీశ్‌బాబు, జగన్మోహన్ రావు, మునీర్ అహ్మద్, రామకృష్ణ, చంద్రకుమార్ ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో గౌరవ సత్కారం పొందేందుకు అర్హత కలిగిన క్రైస్తవులు, సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఆర్.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవారంగం, విశిష్ట వైద్యసేవలు, విద్యాబోధన, సాహిత్యం, కళలు, క్రీడారంగంలో పదేళ్లకు పైబడి సేవలందించిన క్రైస్తవులు, విద్యా, సామాజిక రంగాల్లో 30 ఏళ్లకు పైగా సేవచేస్తున్న సంస్థలు గౌరవ సత్కారం పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులు https://tgcmfc.in వెబ్‌సైట్‌తోపాటు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పొందవచ్చన్నారు. అభ్యర్థులు నిర్ణీత నమూనాలో దరఖాస్తులు నింపి ఈ నెల 10లోగా కలెక్టరేట్‌లోని ఎఫ్–5 బీలో గల మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో అందించాలన్నారు. వివరాలకు 040-23391067లో సంప్రదించాలని కోరారు.

'ఇందిరమ్మ' మొబైల్ యాప్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్: రాష్ట్రంలోని నిరుపేదలకు 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు జారీ చేసినట్లు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో వర్చువల్ విధానం ద్వారా గురువారం ఇందిరమ్మ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. ప్రతీ నియోజకవర్గానికి తొలివిడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు సీఎం ప్రకటించారు. ఇల్లు లేని నిరుపేదలు, సొంతింటి స్థలం కలిగిన వారిని ఇందిరమ్మ కమిటీ అధికారులతో కూడిన బృందం ఎంపిక చేస్తుందని తెలిపారు. అలాగే ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రాంతాలకు అదనంగా ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీవో లోకేశ్వర్‌రావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, గృహనిర్మాణ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఐఎన్‌టీయూసీతోనే సమస్యల పరిష్కారం'



మాట్లాడుతున్న ఇనగాల శ్రీధర్

కాగజ్‌నగర్‌రూరల్: విద్యుత్ కార్మికుల సమస్యలు ఐఎన్‌టీయూసీతోనే పరిష్కారమవుతాయని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(రి.నం.327) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనగాల శ్రీధర్ అన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే గ్రేడ్ చేంజ్ ప్రమోషన్ ఇప్పిస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కందుల శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామకృష్ణ, జిల్లా కార్యదర్శిగా ఎమ్మాజీ సతీశ్, కార్యదర్శిగా అశోక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, కంపెనీ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ తులసీ, రాష్ట్ర డిప్యూటీ ప్రెసిడెంట్ రమేశ్, మందిర్వాల జిల్లా అధ్యక్షుడు బాపురెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బతికితేనే భవిత

- ఆందోళన కలిగిస్తున్న బలవన్మరణాలు
- క్షణికావేశంలోనే తీవ్రమైన నిర్ణయాలు
- ప్రభావం చూపుతున్న మద్యం
- జిల్లాలో మూడేళ్లలో 524 మంది ఆత్మహత్య



జిల్లాలో ఆత్మహత్యల వివరాలు

సంవత్సరం	పురుషులు	స్త్రీలు	మొత్తం
2022	139	54	193
2023	116	40	156
2024(ఇప్పటి వరకు)	131	44	175

కౌటాల(సిర్పూర్): మనిషి పుట్టుక నుంచి మరణం దాకా సాగే ప్రయాణమే జీవితం. చూడగలిగితే ప్రతీ మనిషి జీవితం ఓ అద్భుతమే. పని ఒత్తిళ్లు, ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు, సంబంధాల విచ్ఛిన్నం, దీర్ఘకాలిక మానసిక ఒత్తిళ్లు, మందలింపులు, వ్యసనాలు, తీవ్ర అనారోగ్యం వంటి పరిస్థితుల్లో చాలామంది జీవితాలకు అర్ధంతరంగా ముగింపు పలుకుతున్నారు. ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం ఉంటుంది. ఆ దిశగా ఆలోచిస్తే కచ్చితంగా పరిష్కారం దొరుకుతుంది. తద్వారా ఆత్మహత్య ఆలోచనల నుంచి బయటపడి ప్రశాంతంగా జీవనం సాగించవచ్చు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఇటీవల పెరుగుతున్న ఆత్మహత్యలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. 2022 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 386 మంది పురుషులు, 138 మంది మహిళలు ప్రాణాలు తీసుకుంటున్నారు. గణాంకాల ప్రకారం పురుషులే అధికంగా బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. క్షణికావేశంతో తీసుకుంటున్న నిర్ణయాలు తల్లిదండ్రులకు గుండెకోత మిగులుస్తున్నాయి. పట్టింపులు, కలహాలు, మందలింపులు, మనస్పర్థలు ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయి. కారణాలు ఏవైనా నమ్ముకున్న వారిని నట్టేట ముంచేసి తనువు చాలించడం సరికాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు ఉండడంతో అమాయక ప్రజలు, రైతులు మద్యానికి బానిసలై గొడవలు పడుతున్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జిల్లా పోలీస్‌బాస్ దృష్టి సారించి ఆత్మహత్య నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

నిపుణుల సూచనలు

- సమస్య వచ్చినప్పుడు కుంగిపోకుండా నిబ్బరంగా ఆలోచించాలి.
- నాకే సమస్యలు ఎందుకు వస్తున్నాయని ఆలోచించొద్దు. ఎలా బయటపడాలి అని మాత్రమే చూడాలి.
- చనిపోవాలనే ఆలోచన వచ్చినప్పుడు ఒంటరిగా ఉండొద్దు. స్నేహితులు, కుటుంబ సభ్యులతోనే గడపాలి.
- మనసుకు బాధ కలిగించేలా ఎవరైనా మాట్లాడితే అతిగా స్పందించకుండా తేలిగ్గా తీసుకోవాలి.
- బాధలను ఆత్మీయులతో పంచుకుంటే గుండె తేలికవుతుంది.
- ఆత్మహత్య ఆలోచనలుంటే మానసిక నిపుణులను సంప్రదించడం తప్పనిసరి.

ఇటీవల ఘటనలు

- జూలై 1న కాగజ్‌నగర్‌లో భర్త తాగుడుకు బానిస కావడంతో ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి పురుగుల మందు తాగింది. తల్లితోపాటు ముగ్గురు కుమార్తెలూ మృతి చెందారు. ఈ ఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రతీ కుటుంబంలో ఆర్థిక, కుటుంబ సమస్యలు ఉండటం సహజమే. అయితే ఆర్థిక సమస్యలతోపాటు భర్త తాగుడుకు బానిస కావడం ఆ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది.
- నవంబర్ 22న జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామానికి చెందిన రైతు దుర్రే రాందాస్(44) రెండెకరాల్లో పత్తి సాగుచేశాడు. పంట దిగుబడి రాలేదని మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.
- నవంబర్ 25న మద్యానికి బానిసై పురుగుల మందు తాగి వాంకిడి మండలం సోనాపూర్ గ్రామానికి చెందిన తుంరం బొజ్జు(32) ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబం రోడ్డున పడింది.
- నవంబర్ 27న మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఆసిఫాబాద్ పట్టణంలోని సందీప్‌నగర్ కాలనీకి చెందిన మడావి విజయ్‌కుమార్ (38) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బంగారు భవిష్యత్తు ఉన్న యువకుడు మద్యానికి బానిసై తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తన అక్క, బావలను అడిగాడు. అందుకు వారు నిరాకరించడంతో ప్రాణాలు తీసుకున్నాడు.
- ఈ నెల 3న చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన మండిగా సాయి (23) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన జీవితం విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు.

మానసిక వైద్యుడిని నియమిస్తాం



ఆత్మహత్య చేసుకోవడం క్షణికావేశంలో జరిగే చర్య. ఇది స్వయంకృతాపరాధం. కొత్త ఆశయాలతో కొత్త రోజును ఆస్వాదించాలి. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుంది. ప్రాణం చాలా విలువైనది. ఆత్మహత్యలు అరికట్టేందుకు జిల్లాకేంద్రంలో మానసిక వైద్యుడిని నియమిస్తాం. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి సూచించాం. మానసిక ఒత్తిడిలో ఉన్నవారు టెలీ మానస్ 14416 ఉచిత కాల్ సెంటర్‌ను సంప్రదించాలి.

– సీతారాం, డీఎంహెచ్‌వో

కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సిద్ధం



ప్రతీ కుటుంబంలో సమస్యలు సహజం. వీటిని ఎదుర్కోలేక ప్రాణాలు తీసుకోవడం దారుణం. జిల్లాలో చాలామంది ఆత్మహత్య చేసుకోవడం ఆందోళన కలిగించే అంశం. సమస్యలుంటే అందుబాటులో ఉండే పెద్దల వద్దకు వెళ్లాలి. సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలి. కేసులు లేకుండా కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి. నిరుద్యోగుల కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తాం.

– డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



భోజనం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కెరమెరి మండలం నెహ్రూనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, కూరగాయలతోపాటు అదనపు మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన చదువుతోపాటు రుచికరమైన భోజనం అందించడం ఉపాధ్యాయుల బాధ్యతని అన్నారు. క్రమం తప్పకుండా ప్రార్థనకు హాజరయ్యేలా చూడాలన్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. గడువులోగా వివరాల నమోదు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో ఆడే ప్రకాశ్, ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, డీటీ సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

'దళారుల తీరుతో రైతులకు నష్టం'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: అనుమతులు లేకుండా కాంటాలు పెట్టి పత్తి కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని సీపీఎం నాయకులు అన్నారు. పత్తి రైతులను దళారుల నుంచి కాపాడాలని కోరుతూ జిల్లాకేంద్రంలో గురువారం డీఆర్‌వో దత్తారావుకు వినతిపత్రం అందించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ రైతుల నుంచి దళారులు తక్కువ ధరకే పత్తి పంటను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. క్వింటాల్‌కు దాదాపు రూ.500 నుంచి రూ.700 తక్కువగా చెల్లిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. మార్కెటింగ్ శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడం శాపంగా మారిందన్నారు. ఇప్పటికైనా దళారుల ఆగడాలు అరికట్టి ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, ఆనంద్, రాజేందర్, కార్తీక్ ఉన్నారు.

ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పెద్దపులుల సంచారం నేపథ్యంలో స్పష్టమైన సమాచారాన్ని మాత్రమే ప్రజలకు చేరవేయాలని, వదంతులతో భయభ్రాంతులకు గురిచేయద్దని డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. సమాచారాన్ని వ్యాప్తి చేసే ముందు అటవీశాఖ అధికారులతో ధ్రువీకరించుకోవాలని సూచించారు. తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆత్మగౌరవం, అభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్



మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

కౌటాల(సిర్పూర్): ప్రజల ఆత్మగౌరవం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. కౌటాలలోని జగదాంబ గార్డెన్‌లో గురువారం ప్రజాపాలన సిర్పూర్ నియోజవర్గ స్థాయి విజయోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా ఏ వర్గం ప్రజలను పట్టించుకోలేదన్నారు. ఆ పార్టీ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అదనంగా ఐదు వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. వైఎస్సార్ ప్రారంభించిన ప్రాణహిత ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించి మాజీ సీఎం కేసీఆర్ ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు.

బీజేపీవి మత రాజకీయాలు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం చేస్తోందని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలను పట్టించుకోకుండా రోడ్డుపై ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. తలోడి, యాపలగూడ, గురుడుపేట, కనికి, తాటినగర్ గ్రామాల్లోని రైతులు సాగు చేస్తున్న పీపీ భూములకు కాస్తు పత్రాలు అందిస్తామన్నారు. అనంతరం పలువురిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్, నాయకులు బసర్కార్ విశ్వనాథ్, గంగారం, నానయ్య, శ్యామ్, శ్రీవర్ధన్, అజ్మత్, ఉమామహేశ్, నాహీం, గోపాల్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణం మహిళలకు వరం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మహిళా ప్రయాణికులను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు వరమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఉచిత బస్సు ప్రయాణం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఎంతోమంది మహిళలకు లబ్ధి చేకూరిందన్నారు. పథకాన్ని విజయవంతం చేయడంలో ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, క్లీనర్లు, సిబ్బంది పాత్ర ఎంతో కీలకమన్నారు. డిపోలకు నూతన బస్సులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్టాండ్లలో తాగునీరు, మూత్రశాలల ఏర్పాటుతోపాటు రాత్రిపూట ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని మారుమూల గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పించాలని డీఎంకు సూచించారు. అనంతరం అనంతరం ఉద్యోగ, వ్యాపార పనుల నిమిత్తం నిత్యం వివిధ ప్రాంతాలకు ప్రయాణించే మహిళలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ విశ్వనాథ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'హామీలను విస్మరించిన కాంగ్రెస్'



ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో వైఫల్యాలు, ఆరుఅబద్ధాలు, 66 మోసాలపై కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పెట్రోల్ పంపు నుంచి ప్రారంభమై పలు వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో నాయకులు దోని శ్రీశైలం, సిందం శ్రీనివాస్, కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ 'హస్తం' గూటికే..

- కాంగ్రెస్‌లోకి సోయం, ఆత్రం
- గాంధీభవన్‌లో ఇద్దరి చేరిక
- ఆదిలాబాద్‌పై పట్టున్న నేతలు
- జిల్లా పరిషత్‌లపైనే వీరి గురి!



గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరిన సోయం బాపూరావు, ఆత్రం సక్కు

సాక్షి, ఆదిలాబాద్: మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్ వేదికగా గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. గతంలో హస్తం పార్టీ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లిన వీరు తిరిగి అదే గూటికి చేరుకున్నారు. సోయం బాపూరావు బోథ్ నియోజకవర్గానికి చెందిన నేత కాగా, గతంలో బీఆర్‌ఎస్ నుంచి బోథ్ ఎమ్మెల్యేగా, బీజేపీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా వ్యవహరించారు. ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఆత్రం సక్కు రెండుసార్లు ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచే గెలుపొందారు. రెండోసారి గెలిచిన తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ ఆదివాసీ నేతలు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంపై పట్టున్నవారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందునుంచే వీరు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరిగింది.

'స్థానిక' ఎన్నికలకు ముందు..

పార్లమెంట్ ఎన్నికల సమయంలో జరిగిన కొన్ని వైఫల్యాల కారణంగా పార్టీ ఓటమి పాలైందనే అభిప్రాయం కాంగ్రెస్‌లో ఉంది. ఈ నేపథ్యంలో ముందున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పార్టీ ప్రణాళికతో ముందుకు వెళ్తుందని ఆ పార్టీ ముఖ్యనేత పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో నిర్మల్, కాగజ్‌నగర్ నుంచి బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీ వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, విఠల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. బోథ్ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కూడా హస్తం పార్టీలో చేరినా ఆయనకు ఎంపీ టికెట్ రాకపోవడంతో ఆ తర్వాత పార్టీలో క్రియాశీలకంగా లేరనే అభిప్రాయం కార్యకర్తల్లో ఉంది. ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో అధికార పార్టీకి బలమైన నాయకులు లేకపోవడంతో మరిన్ని ఓట్లు సాధించలేకపోయామనే అభిప్రాయం పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ విశ్లేషణలో వ్యక్తమైంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ఇద్దరు బలమైన నేతలు పార్టీలో ఉంటే ప్రయోజనం ఉంటుందని కాంగ్రెస్ అధిష్టానం పకడ్బందీగా ముందుకు వెళ్తోంది. ప్రధానంగా సోయం బాపూరావుకు ఎంపీగా వ్యవహరించిన అనుభవంతోపాటు పార్లమెంట్ పరిధిలో పట్టుంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీగా పోటీ చేసిన ఆత్రం సక్కు కూడా మంచి పట్టుండటంతో కాంగ్రెస్ వీరి సేవలు వినియోగించుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లా పరిషత్‌లపైనే గురి!

ప్రధానంగా ఎస్టీ నేతలైన సోయం, సక్కు స్థానిక సంస్థల ఎన్నికల ముందు హస్తం గూటికి చేరడంపై రకరకాల విశ్లేషణలు మొదలయ్యాయి. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మన్ గిరీల రిజర్వేషన్ ఎస్టీ కావడమే ఇందుకు కారణం. ఆదిలాబాద్ వైపు సోయం బాపూరావు, కుమురంభీం ఆసిఫాబాద్ వైపు ఆత్రం సక్కు బరిలో ఉంటారా? అని కాంగ్రెస్‌లో చర్చకు దారితీసింది. అయితే హస్తం పార్టీలో చేరిన ఈ నేతలు ఆ దిశగా ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదని, ఎలాంటి షరతులు లేకుండానే చేర్చుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అందరి అభిప్రాయంతోనే..

గాంధీభవన్ వేదికగా జరిగిన ఈ చేరిక కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క లేకపోవడంపై కూడా పార్టీలో చర్చ జరుగుతోంది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు మాత్రమే ఉన్నారు. సీతక్క కార్యక్రమానికి హాజరు కాకపోవడానికి కారణమేమై ఉంటుందోననే సందిగ్ధం కార్యకర్తల్లో నెలకొంది. వీరి చేరికకు సంబంధించి మొదట్నుంచి సీతక్క ఆధ్వర్యంలోనే ప్రణాళిక సాగిందని, పార్టీలో అందరి అభిప్రాయం తీసుకుని ఆమె నిర్ణయం మేరకే ముందుకువెళ్లినట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు 'సాక్షి'తో చెప్పారు.

కాంగ్రెస్ టికెట్‌తోనే పోటీ

ఆసిఫాబాద్: మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు 1997 నుంచి ట్రైబల్ రైట్స్ ఆర్గనైజేషన్‌లో పనిచేశారు. ఆ తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయుడిగానూ సేవలందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా రాజీనామా చేసి 2008 నవంబర్‌లో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి తొలిసారి ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో రెండోసారి కోవ లక్ష్మి చేతిలో ఓడిపోగా, 2018లో మరోసారి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం జరిగిన పరిణామాలతో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన సక్కు ఓటమి పాలయ్యారు. మూడో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరిన సక్కు గులాబీ పార్టీలో బలమైన తన వర్గాన్ని నిర్మించుకోలేకపోయారు. సుమారు ఆరేళ్లపాటు పార్టీలోనే కొనసాగిన అనంతరం ఎట్టకేలకు సొంత గూటికి చేరారు. రెండు నెలల క్రితం ఎమ్మెల్సీ దండే విఠల్ సక్కు చేరికపై అధిష్టానాన్ని ఒప్పించినప్పటికీ చివరి నిమిషంలో వాయిదా పండింది. తాజాగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్ మరోసారి చొరవ చూపడంతో హస్తం పార్టీలో చేరినట్లు తెలుస్తోంది. ఆదివాసీ సామాజిక వర్గంలో బలమైన నేతగా పట్టున్న ఆత్రం సక్కును చేర్చుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో బలం చేకూరవచ్చని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

సర్వీసు రోడ్డుపై లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

నేరడిగొండ(బోథ్): మండల కేంద్రంలోని సర్వీసు రోడ్డుపై గురువారం తెల్లవారు జామున హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు పేపర్ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. దీంతో ఆ రోడ్డు గుండా నిర్మల్ నుంచి ఆదిలాబాద్, బోథ్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారి పైనుంచి వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ తర్వాత యధావిధిగా వాహనాలు రాకపోకలు సాగించాయి.

రైతుపై అడవిపంది దాడి



ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): రైతుపై అడవి పంది దాడిచేసిన ఘటన మండలంలోని ముత్నూర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మడావి నాగోరావ్ గురువారం మధ్యాహ్నం మెండపల్లి శివారులోని తన చేనులో పత్తి ఏరుతుండగా అకస్మాత్తుగా అడవిపంది దాడి చేసింది. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఒకరికి దేహశుద్ధి

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఒకరు గురువారం అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న సదరు మహిళ కుటుంబ సభ్యులు అతనికి దేహశుద్ధి చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై ఉదయ్‌కిరణ్‌ను సంప్రదించగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పేర్కొన్నారు.

అత్యాచారయత్నం కేసులో ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్/నిర్మల్‌రూరల్: బాలికపై అత్యాచారానికి యత్నించిన కేసులో ఒకరికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కర్ణకుమార్ గురువారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ రూరల్ మండలంలోని ద్యంగాపూర్‌కు ఏల్లుల చంద్ అలియాస్ చంద్రశేఖర్ 2021 మార్చి 31న అదే గ్రామానికి చెందిన బాలిక(15)పై అత్యాచారానికి యత్నించాడు. సదరు బాలిక తప్పించుకుని వెళ్లి తల్లికి చెప్పగా నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై సుమన్ కేసు నమోదు చేయగా డీఎస్పీ ఉపేందర్ దర్యాప్తు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్‌రెడ్డి 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితునికి పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు.

బొమ్మె చేపలు C/O హాజీపూర్!

- సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు అనుమతులు
- ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద అంతర్జాతీయ స్థాయిలో కేంద్రం
- 30 ఎకరాల్లో రూ.15 కోట్లతో బొమ్మె చేపల పెంపకం



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద బొమ్మె చేపల సంరక్షణ కేంద్రం ప్రతిపాదిత స్థలం ఇదే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బొమ్మె చేపల పెంపకం, సంరక్షణ ప్రాజెక్ట్‌కు మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం వేదిక కానుంది. రాష్ట్ర ప్రభుత్వం బొమ్మె చేపల పెంపకాన్ని పెద్ద ఎత్తున చేపట్టబోతోంది. దేశంలోనే తొలిసారి జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్)కి చెందిన మంచినీటి చేపల పెంపకం సంస్థ సీఐఎఫ్ఏ (సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వా కల్చర్) ఆధ్వర్యంలో బొమ్మె చేపల పెంపకం జరగనుంది.

బొమ్మె చేపల వృద్ధి లక్ష్యంగా..

తెలంగాణలో బొమ్మె చేపకు ప్రత్యేక స్థానం ఉంది. పొడవుగా, నునుపుగా ఉండటంతో పాటు అనేక పోషకాలతో నిండి ఉంటుంది. ఈ చేపను 2016లో ప్రభుత్వం రాష్ట్ర చేపగా గుర్తించింది. మత్స్యశాఖ ద్వారా బొమ్మె చేపల వృద్ధిని చేపట్టేందుకు నిర్ణయించింది. ఈచేప జన్యువును లక్నోలోని నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనెటిక్ రిసోర్స్‌లో భద్రపరిచి మరింత అభివృద్ధికి ప్రణాళికలు చేస్తోంది. డిమాండ్‌ను అనుసరించి మార్కెట్‌లో హై బ్రీడ్ చేపలతో పాటు క్యాట్ ఫిష్‌లు విక్రయిస్తున్నా రు. ఈ నేపథ్యంలోనే బొమ్మె చేప పెంపకం, వి ని యోగం పెంచేలా కొత్త ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం ప్రతి పాదించగా కేంద్రం సైతం ఆమోదం తెలిపింది. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇక్కడ కార్యరూపం దాల్చనుంది. త్వరలోనే ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

పెంపకం..సంరక్షణ..ఆపై ఎగుమతి

ఎల్లంపల్లి జలాశయం వద్ద బొమ్మె చేపల పెంపకం, సంరక్షణ కేంద్రం ఏర్పాటు జరుగుతోంది. బొమ్మెతో పాటు బురదమట్టలు, పూలమట్టలు, తదితర రకాల చేపల విత్తన కేంద్రం, పెంపకానికి హచరీలు సైతం ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాదు వీటి సంరక్షణ, వ్యాధుల నివారణకు ప్రత్యేక కేంద్రాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రంలో ఉత్పత్తి అయ్యే చేప పిల్లలను ప్రభుత్వం ఏటా చేపట్టే చేపల పంపిణీ పథకానికి వినియోగించనున్నారు. ఇక మృగశిరకార్తెలో చేప ప్రసాదానికి కూడా వీటిని విక్రయించనున్నారు. అంతేకాకుండా రాష్ట్ర అవసరాలు తీరాక ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఈ ప్రాంత చేపలను ఎగుమతి చేయనున్నారు. మరోవైపు ఈ కేంద్రం శిక్షణకు ఉపయోగ పడటంతో పాటు చేపలపై విస్తృత స్థాయి పరిశోధనలకు నిలయంగా మారనుంది. ఫిష్‌పాండ్‌లో ఉన్న మిగిలిన 55 ఎకరాల్లో ఆక్వా కల్చర్ ఫాం ఆరు నెలల్లో పూర్తిస్థాయి వినియోగంలోకి రానుంది.

30 ఎకరాల్లో పెంపకం..

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులోని గోదావరి నదిపై గల ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద ఫిష్‌పాండ్ కోసం 85 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ఇరిగేషన్ శాఖ ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూశాఖ ద్వారా మత్స్యశాఖకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారు. 85 ఎకరాల స్థలంలోని 30 ఎకరాల్లో బొమ్మె చేపల పెంపకం కోసం ప్రభుత్వం భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభు త్వ సహకారంతో రూ.15 కోట్లతో బొమ్మె చేపల పెంపకం, సంరక్షణ చేపడుతోంది. బొమ్మె చేపల జాతిని కాపాడటంతో పాటు చేపల సంఖ్యను గణనీయంగా పెంచేలా ప్రభుత్వం సంకల్పించింది.

ఆర్థికాభివృద్ధి దిశగా..

హాజీపూర్‌లో ఫిష్‌పాండ్, బొమ్మె చేపల పెంపకం చేపడుతుండగా ఈ ప్రాంత ప్రజలు ఉపాధి పొందటంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయి. ఫిష్‌పాండ్‌లో ఉత్పత్తి అయ్యే చేప పిల్లలతో అర ఎకరం నుంచి ఎకరం ఆపై ఎంత విస్తీర్ణంలోనైనా సొంతంగా చేపల పెంపకం కోసం ఫిష్ పాండ్‌లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. పెంచిన చేపలను ఫిష్‌పాండ్ ద్వారా కొనుగోలు చేయనున్నారు. ఈ ప్రాంత మత్స్యకారులతో పాటు ప్రతీ ఒక్కరూ చేపల పెంపకం చేపట్టి ఆర్థికాభివృద్ధి దిశగా ముందుకు సాగనున్నారు. మొత్తంగా చేపల పెంపకంతో హాజీపూర్ మండలంలోని గుడిపేట భవిష్యత్‌లో దేశానికి మార్గదర్శనం కానుంది.

'సమగ్ర శిక్ష'లో సమ్మె సైరన్

- డిమాండ్లు నెరవేర్చాలని దీక్షలు
- ఈ నెల 6, 7 తేదీల్లో రిలే నిరసన దీక్షలు
- 9 నుంచి నిరవధిక దీక్షలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2,474 మంది ఉద్యోగులు



గతేడాది సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

జిల్లాల వారీగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు

జిల్లా	ఉద్యోగులు
మంచిర్యాల	596
ఆదిలాబాద్	657
నిర్మల్	702
కుమురంభీం	519
మొత్తం	2,474

లక్ష్మణచాంద(నిర్మల్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు నేటి నుంచి సమ్మె బాట పట్టనున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసేలా నేటి నుంచి సమ్మె చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

నేటి నుంచి సమ్మె బాటలో...

ఈనెల 6, 7 తేదీలలో ఆయా జిల్లా కేంద్రాల్లో రిలే నిరసన దీక్షలు చేపట్టనున్నారు. ఈ రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి స్పందన లేకుంటే ఈనెల 9 నుంచి నిరవధిక నిరసన దీక్ష చేపట్టనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,474 మంది..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా డీఈవో, ఎంఈవో కార్యాలయాలు, భవిత కేంద్రాలు, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, యూఆర్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది మొత్తం 2,474 మంది పనిచేస్తున్నారు.

డిమాండ్లు ఇవే...

1. ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేసి పేస్కేల్ అమలు చేయాలి.
2. రీ ఎంగేజ్ విధానం తొలగించాలి.
3. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలి.
4. పీటీఐలకు మిగిలిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల మాదిరి 12 నెలల వేతనం ఇవ్వాలి.
5. జీవిత బీమా, ఆరోగ్య బీమా కింద రూ.10 లక్షలు, పదవీ విరమణ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు ఇవ్వాలి.

గతంలో హామీ ఇచ్చినా...

తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గతంలో నిరసన చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేలా చొరవ చూపాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు కోరుతున్నారు.

హామీలు అమలు చేయాలి



మా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గతంలో నిరవధిక దీక్షలు చేపట్టాం. తమ ప్రభుత్వం ఏర్పడితే సమస్య పరిష్కరిస్తామని గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.

– గంగాధర్, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

గంజాయి పట్టివేత



వాంకిడి: నిందితుడితో పోలీసులు

వాంకిడి: మండలంలోని సవాతి గ్రామానికి చెందిన షిండె శ్యాంరావు ఇంట్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 1600 గ్రాముల గంజాయిని గురువారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు శ్యాంరావు ఇంట్లో తనిఖీ చేయగా సుమారు రూ.40 వేల విలువైన గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. గంజాయిని సీజ్ చేసి, నిందితున్ని పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేష్, కానిస్టేబుళ్లు మధు, రమేశ్, దేవేందర్, సంజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్ శివారులో విక్రయించడానికి సిద్ధంగా ఉన్న గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. రవీంద్రనగర్ గ్రామానికి చెందిన హరిదాస్ సర్దార్ గంగాపూర్ శివారులోని కాలువ వద్ద గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. గంజాయి విలువ సుమారు రూ.6వేల వరకు ఉంటుందని ఎస్సై తెలిపారు.

మహిళ దారుణ హత్య

- మంచిర్యాల జిల్లా పాత బెల్లంపల్లిలో ఘటన

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలంలోని పాత బెల్లంపల్లిలో గురువారం ఓ మహిళ దారుణహత్యకు గురైంది. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో తన భార్య అత్త పక్షాన మాట్లాడిందన్న కోపంతో ఓవ్యక్తి మహిళ ప్రాణాలను బలితీసుకున్నాడు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కమ్మరి మహేష్ ఏదో విషయంలో తన భార్య మౌనికతో గొడవ పడ్డాడు. గొడవ తీవ్రతరం కావడంతో కోపోద్రిక్తుడై తన భార్య మౌనికను చితక బాదాడు. దెబ్బలకు తాళలేక ఆమె అరుపులు పెట్టడంతో ఇరుగు పొరుగున నివాసం ఉంటున్న మౌనిక తల్లి బురుస పద్మ, చెల్లెలు బుచ్చమ్మ, చిన్నమ్మ యెండెల కమల (50) వచ్చి మహేష్‌ను వారించారు. కోపోద్రిక్తుడైన మహేష్ దుర్భాషలాడుతూ తన అత్త పద్మ, బుచ్చమ్మను పొగగొట్టంతో చితక బాదాడు. పద్మ తలకు గాయమైంది. కొంతసేపటికి గొడవ సద్దుమణగడంతో కమల, మరో ఇద్దరు మహిళలు నీళ్ల తెచ్చేందుకు బోరువద్దకు వెళ్లగా అప్పటికే కాచుకూర్చొని ఉన్న మహేష్ వారిని తిడుతూ కమలను కిందకు తోసేశాడు. బిందెను తలపై ఎత్తేసి గూన పెంకులతో తలపై బలంగా బాదాడు. అంతటితో ఆగకుండా ఛాతిపై కాలితో బలంగా తన్నడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. స్థానికులు వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారని సీఐ వెల్లడించారు. కాగా ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది. ఘటనాస్థలిని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్సై రమేశ్ సందర్శించారు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు యెండెల రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తాళ్ల గురిజాల ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై ఇసాక్ తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన పెన్నంవార్ గణేశ్ (47) టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తుండగా కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. రాత్రి భార్య, కుమారుడు ఇంటికి వచ్చి చూడగా తలుపుకు లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా కాళ్లు వేలాడుతూ కనిపించడంతో తలుపులు పగులగొట్టి కిందకు దించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా హుటాహుటిన రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ...



అరుణ(ఫైల్)

నర్సాపూర్(జి): కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గాదరి అరుణ (40) కొంతకాలంగా కడుపులో నొప్పితో బాధపడుతోంది. బుధవారం సాయంత్రం కడుపునొప్పి తీవ్రం కావడంతో పురుగుల మందు తాగింది. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి మేనమామ గుండోల్ల దత్తురాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..



రోహిదాస్ (ఫైల్)

బోథ్: మనస్తాపంతో పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని దేవుల్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ రోహిదాస్ (41) ఇటీవల పత్తి పంట విక్రయించాడు. డబ్బులు తన అకౌంట్‌లో జమ అయ్యాయి. అయితే అతనికి మద్యం సేవించే అలవాటు ఉండటంతో డబ్బులు ఖర్చు పెడతాడన్న ఉద్దేశంతో అతని భార్య రాథోడ్ లక్ష్మి తన అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. దీంతో మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామయ్య

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ స్టేజీ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. దండేపల్లి మండలం నంబాలకు చెందిన సురేందర్ (33) ద్విచక్ర వాహనంపై లక్సెట్టిపేట నుంచి మంచిర్యాలలోని తన సోదరి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కోళ్లవ్యాన్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అల్పాహారంలో తగ్గిన పరిమాణం



కేకే-5 గని క్యాంటీన్‌లో తూకం వేసిన పూరి

మందమర్రిరూరల్: డ్యూటీ సమయంలో కార్మికులకు అల్పాహారం అందించేందుకు గనిపై నిర్వహిస్తున్న క్యాంటీన్‌లో సింగరేణి యాజమాన్యం మెనూ ప్రకారం పలు ఐటమ్స్ చేయిస్తుంది. కొంత క్వాంటిటీ నిర్ణయించి రూ.5కే ప్లేట్ (5 పూరీలు) అందిస్తున్నారు. అయితే పరిమాణం తగ్గుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్కోపూరి సుమారు 16 గ్రాముల పైబడి ఉండాల్సి ఉండగా 8 గ్రాములు తగ్గడంతో కార్మికులు ఇదేంటని ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి అల్పాహారం క్వాంటిటీ పెంచే విధంగా నిధులు సమకూర్చాలని యూనియన్ల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.


థియేటర్ అద్దాలు ధ్వంసం



ధ్వంసమైన శ్రీనివాస టాకీస్ అద్దాలు

చెన్నూర్: తమ అభిమాన హీరో సినిమా ప్రదర్శించలేదని థియేటర్‌ను ధ్వంసం చేసిన ఘటన చెన్నూర్‌లో చోటు చేసుకుంది. పట్టణంలోని శ్రీనివాస థియేటర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పుష్ప-2 సినిమాను ప్రదర్శించడం కుదరలేదు. దీంతో చెన్నూర్‌కు చెందిన బజ్జూరి వినయ్, అతని అనుచరులు గేటు తాళాలు పగలకొట్టి లోనికి ప్రవేశించి అద్దాలు ధ్వంసం చేశారు. థియేటర్ యజమాని కుర్మ మల్లగౌడ్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించి నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు.

చిరుత కాదు.. పిల్లి



బావిలో ఇండియన్ కేవిట్ పిల్లి

కుభీర్: మండలంలోని హల్దా శివారులో గుమ్ముల సాయినాథ్‌కు చెందిన వ్యవసాయ బావిలో చిరుతపులి మాదిరి ఉన్న జంతువును గమనించి గ్రామానికి చెందిన కూనింటి రామకృష్ణ అటవీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వచ్చేసరికి చీకటి పడడంతో సెల్‌ఫోన్ ఆధారంగా అది పులికాదని ఇండియన్ కేవిట్ రకం పిల్లి అని తేల్చి చెప్పారు. గురువారం ఉదయం బీట్ ఆఫీసర్ ఎ.రాజేశ్ వచ్చి బావిలో చూడగా పిల్లి కనిపించలేదు. గ్రామస్తుల సహకారంతో పరిసరాల్లో వెతికించినా కనిపించలేదు. దీంతో ఎవరూ భయపడవద్దని, అది చిరుతకాదు పిల్లి అని, అందరూ యధావిధిగా పనులు చేసుకోవాలని చెప్పారు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. నిర్మల్ జిల్లాకు చెందిన అన్నదమ్ములు లక్ష్మణ్, పెద్ద పోశెట్టి మహారాష్ట్ర నుంచి ద్విచక్రవాహనంపై నిర్మల్‌కు వెళ్తుండగా ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్‌ను లారీ ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ఈ విషయమై రూరల్ ఎస్సై ముజాహిద్‌ను సంప్రదించగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. లారీవారిని ఢీకొట్టలేదని, అదుపుతప్పి కిందపడినట్లు తమకు సమాచారం ఉందన్నారు.

గొర్రెల మందపై అడవి జంతువుల దాడి



పాదముద్రలు సేకరిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని రణవెల్లి సమీపంలో బుధవారం రాత్రి మేకలు, గొర్రెల మందపై అటవీ జంతువులు దాడికి పాల్పడగా 20కి పైగా మృతి చెందాయి. బాధితుల కథనం మేరకు గ్రామ సమీపంలోని ప్రాణహిత నది మధ్యలో ఉన్న ద్వీపంలో మేకలు, గొర్రెలను పెంచుతున్నారు. ఈక్రమంలో బుధవారం రాత్రి దొడ్డిపై అటవీ జంతువులు దాడికి పాల్పడగా 20కి పైగా మూగ జీవాలు మృతి చెందాయి. దాడి చేసిన సమయంలో భయంతో దూరంగా వెళ్లి దాక్కున్నామని కాపలాగా ఉన్న భీంకరి శంకర్, దండికె బాపు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఘటనా స్థలానికి వెళ్లి బాధితుల నుండి వివరాలు సేకరించారు. అటవీ బీట్ అధికారి ప్రభాకర్ ఘటనా స్థలానికి వెళ్లి పాదముద్రలు సేకరించారు. డిప్యూటీ రేంజ్ అధికారి హైమావతి మాట్లాడుతూ దాడికి పాల్పడింది పులి కాదని స్పష్టం చేశారు.

బ్యాంకర్లు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: బ్యాంకర్లు.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కన్సలిటేటివ్ కమిటీ వార్షిక సంస్థలకు రెండో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ప్రజలకు ఇచ్చిన రుణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పేదప్రజలకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు, రైతులకు రుణాల మంజూరులో ఆలస్యం కాకుండా చూడాలన్నారు. సైబర్ నేరాల బారిన పడి మోసపోకుండా ఖాతాదారులను చైతన్యవంతం చేయాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, ఆర్‌బీఐ ఎల్‌బీవో గిమతి, నాబార్డు డీడీఎం వీరభద్రుడు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎస్పీ ప్రభాకర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రామారావు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, మెప్మా పీడీ సుభాశ్, బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు.

గర్భంలో శిశువు మృతి

- వైద్యురాలి నిర్లక్ష్యమేనని ఆరోపణ
- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



మృత శిశువు

ఆదిలాబాద్‌టౌన్: ప్రసవం కోసం జిల్లా కేంద్రంలోని పూలే చౌక్ సమీపంలోగల ఓ నర్సింగ్ హోంకు వెళ్లిన మహిళ గర్భంలోనే శిశువు మృతి చెందింది. వైద్యురాలి నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తూ కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద-టీ గ్రామానికి చెందిన ఉష్కం వెంకటి భార్య లక్ష్మి మొదటి కాన్పు కోసం బుధవారం నర్సింగ్ హోంకు వచ్చింది. ప్రసవానికి ఇంకా సమయముందని, గురువారం రావాలని వైద్యురాలు సూచించారు. దీంతో గురువారం మధ్యాహ్నం ఆమెకు నొప్పులు రాగా ఆస్పత్రికి వచ్చి వైద్యురాలికి చూపించారు. ఆమెను మొదటి అంతస్తుకు తీసుకెళ్లాలని సిబ్బందికి చెప్పగా వారు ఆమెను నడిపిస్తూ తీసుకెళ్లారు. ఎన్నిసార్లు పిలిచినా వైద్యురాలు ఆమె వద్దకు రాలేదు. ఆమె నొప్పులతో అల్లాడుతుండగా కిందికి పిలిచారు. మళ్లీ నొప్పులతోనే ఆమె కిందికి వచ్చినా పట్టించుకోలేదు. ఆమె సూచన మేరకు పట్టణంలోని ఓ స్కానింగ్ సెంటర్‌కు తీసుకెళ్లి స్కానింగ్ తీయించారు. రిపోర్టు పరిశీలించిన వైద్యురాలు గర్భంలో శిశువు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో ఆమె కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లినైనా కాపాడాలని కాళ్లా.. వేళ్లా పడ్డారు. దీంతో రూ.7వేలు డిపాజిట్ చేస్తే డెలివరీ చేస్తానని వైద్యురాలు చెప్పారు. శిశువు మృతికి వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె తీరును నిరసిస్తూ సాయంత్రం 5నుంచి రాత్రి 8గంటల వరకు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రైవేట్ వైద్యులు అక్కడికి చేరుకున్నారు. దీనిపై సదరు వైద్యురాలిని వివరణ కోరగా స్పందించలేదు.